శుక్రవారం 04-10-2024

# ముందడుగు

సంపుటి: 1, సంచిక: 475 పేజీలు: 4 | ₹6

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

EPAPER.MUNDADUGU.COM

దినపత్రిక

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616

email: mundadugu111@gmail.com



ఆర్జీ కర్ ఆసుపత్రిలో అత్యాచార బాధితురాలి విగ్రహం

మిగతా 3లో




నకిలీ ఎస్‌బీఐ బ్యాంకు బ్రాంచ్‌ను తెరిచారు

మిగతా 3లో



గిఫ్ట్‌లు స్వీకరించినందుకు 12 నెలల జైలు

మిగతా 3లో



ముందడుగు సెల్ఫీ కాంటెస్ట్

మిగతా 5లో

# జైళ్లలో కుల వివక్షపై సుప్రీం ఆగ్రహం

## ఖైదీలను వేరుగా చూడరాదని ఆదేశం



**ముందడుగు ఢిల్లీ:**

శిక్ష పడ్డ ఖైదీలు అందరూ జైలులో సమానమే నని, కొన్ని జైళ్లలో జరుగుతున్న కుల వివక్ష పట్ల సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఖైదీలను కులవివక్ష ఆధారంగా వేరుగా చూడరాదని కోర్టు చెప్పింది. అన్ని కులాలకు చెందిన ఖైదీలను మానవత్వంతో, సమానంగా చూడాలని కోర్టు తెలిపింది. జైళ్లలో ఉన్న ఖైదీలకు పని విషయంలో సమాన హక్కు కల్పించాలని కోర్టు వెల్లడించింది. ప్రమాదకర పరిస్థితుల్లో ఉండే సీవేజ్ ట్యాంక్‌లను ఖైదీలు శుభ్రం చేసే అనుమతి ఇవ్వకూడదని కోర్టు చెప్పింది. రాష్ట్ర జైలు మాన్యువల్స్‌లో ఉన్న అభ్యంతరకర రూల్స్‌ను కోర్టు కొట్టిపారేసింది. మూడు నెలల్లోగా ఆ నియమావళిని సవరించాలని సుప్రీంకోర్టు తెలిపింది. ఓ కులానికి చెందిన వ్యక్తులనే స్వీపర్లుగా ఎంపిక చేయడం సరైన విషయం కాదు అని కోర్టు చెప్పింది.

# మూసీని అడ్డంపెట్టుకుని ఎంతకాలం బతుకుతారు

## హైదరాబాద్‌లో మీ భరతం పడతాం

### ప్రతి ఫ్యామిలీకి డిజిటల్ కార్డు ఇస్తున్నాం

### డిజిటల్ కార్డుల ప్రారంభోత్సవంలో రేవంత్ రెడ్డి



**ముందడుగు హైదరాబాద్:**

తెలంగాణలోని ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందరికీ అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతోనే ఫ్యామిలీ డిజిటల్ కార్డు ఇస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రేషన్‌కార్డు కోసం గత పదేళ్లు ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగారన్నారు. సికింద్రాబాద్‌లోని కంటోన్మెంట్‌లో కుటుంబ డిజిటల్ కార్డుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా భారాస నేతలపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్, హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి కుమారుల ఫాంహౌస్‌లు కూల్చాలా? వద్దా? చెప్పాలని ప్రశ్నించారు. అవి కూల్చుతామనే పేదలను అడ్డుపెట్టుకుని ధర్నాలు,

మిగతా 2లో



# కొండా సురేఖపై పరువు నష్టం కేసు

## నాంపల్లి న్యాయస్థానాన్ని ఆశ్రయించిన నాగార్జున

**ముందడుగు హైదరాబాద్:**

తెలంగాణ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై సినీ నటుడు అక్కినేని నాగార్జున తన కుటుంబాన్ని, వ్యక్తిగత విషయాలను ప్రస్తారించారని కొరుతూ మంత్రి కొండా సురేఖపై పరువు నష్టం దావా వేశారు. తమ కుటుంబ గౌరవాన్ని, ప్రతిష్ఠ దెబ్బతీసేలా సురేఖ వ్యాఖ్యలు చేశారంటూ నాంపల్లి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. మరోవైపు మంత్రి సురేఖ వ్యాఖ్యలపై చిత్ర పరిశ్రమ వర్గాలు మండిపడ్డాయి. బాధ్యతాయుతమైన పదవిలో ఒక మహిళా మంత్రిగా ఉండి, మరో మహిళ పేరు ప్రస్తావించడం, రాజకీయాలతో సంబంధం లేని అక్కినేని కుటుంబాన్ని వివాదంలోకి లాగడం సరైనది కాదంటూ సామాజిక మాధ్యమాల వేదికగా వరుస పోస్టులతో అసహనం వ్యక్తం చేశారు.

ముందడుగు
శుక్రవారం, 04-10-2024, హైదరాబాద్

# మూసీని అడ్డంపెట్టుకుని ఎంతకాలం బతుకుతారు


(మొదటి పేజీ తరువాయి)

దీక్షలు చేస్తున్నారన్నారు. "మూసీని అడ్డంపెట్టుకుని ఎంతకాలం బతుకుతారు.. హైదరాబాద్‌లో మీ భరతం పడతాం" అని భారాసను ఉద్దేశించి సీఎం వ్యాఖ్యానించారు. కేసీఆర్ అధికారంలో ఉంటే రేషన్‌కార్డు రాదని ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం ఇచ్చారు. కొత్తగా రేషన్‌కార్డులు లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు అందడం లేదు. సంక్షేమ పథకాల అమలుకు డిజిటల్ కార్డులు అవసరం. ప్రతి పేదవాడికీ కార్డు అందించాలనే లక్ష్యంతో ఉన్నాం. రేషన్, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు ఈ ఫ్యామిలీ డిజిటల్ కార్డు ఉపయోగపడుతుంది. ఇది కుటుంబానికి రక్షణ కవచం. దీనిలో ఆరోగ్యపరమైన వివరాలు కూడా పొందుపరుస్తాం. గతంలో ఏ వైద్యం అందింది.. ఏ మందులు వాడారు అనేది వైద్యులకు సులభంగా అర్థమవుతుంది. గ్రామాల నుంచి ఉపాధి కోసం పట్టణాలు, నగరాలకు వచ్చిన పేదలు ఉన్న ప్రాంతంలోనే రేషన్ తీసుకునే వెసులుబాటు కలుగుతుంది. నియోజకవర్గానికి రెండు చోట్ల దీన్ని పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్నాం. దీనిలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు సరిదిద్దుతాం" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

# మిజోరం గవర్నర్‌ను కలిసిన అక్కినేని నాగార్జున

**ముందడుగు, అమరావతి :**

ప్రముఖ సినీనటుడు అక్కినేని నాగార్జున (**Akkineni Nagarjuna**) మిజోరం గవర్నర్ (**Mizoram Governor**) ను కలిశారు. గురువారం హైదరాబాద్ నుంచి బయలుదేరి విశాఖపట్నంలోని గవర్నర్ కంభంపాటి హరిబాబు నివాసానికి వెళ్లారు. ఇటీవల గుండె శస్త్రచికిత్స చేయించుకున్న హరిబాబును యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తదితరులున్నారు.





# పేదలపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రతాపం

## హైడ్రా పేరుతో కూల్చివేతలు ఆపాలి

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**ముందడుగు హైదరాబాద్:**

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి పేదలపై ప్రతాపం చూపుతున్నారని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. హైడ్రా పేరుతో కూల్చివేతలు ఆపాలని సీఎంకు విజ్ఞప్తి చేశామన్నారు. నాంపల్లిలోని బిజెపి కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.



"గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం.. మూసీ సుందరీకరణ చేయాలని ఆలోచించింది. ప్రజల నుంచి వ్యతిరేకత రాగానే వెనక్కి తగ్గింది. డ్రైనేజీ సమస్య పరిష్కరించకుండానే మూసీ సుందరీకరణ చేయాలని చూస్తున్నారు. తాగునీరు, డ్రైనేజీ కలిసి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూల్చవద్దని ప్రభుత్వాన్ని కోరాం. విధ్వంసాన్ని ఆపాలని సీఎంకు లేఖ రాశాను. ప్రజల ఆవేదనను పరిగణనలోకి తీసుకోకుండా వ్యవహరించడం న్యాయం కాదు" అని కిషన్‌రెడ్డి అన్నారు. మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలపై మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా కిషన్‌రెడ్డి స్పందించారు. ఆమె వ్యాఖ్యలను ఖండించారు. మహిళలు, కుటుంబాల గురించి మాట్లాడటం భారాస, కాంగ్రెస్ పార్టీలకు అలవాటైందని విమర్శించారు.

# బిఆర్ఎస్ ఓటమికి కేటీఆరే ప్రధాన కారణం

## కేటీఆర్ సీఎం అనుకుని పిచ్చి నిర్ణయాలు ▪ కేటీఆర్‌పై కొండా సురేఖ మరోసారి ఆగ్రహం

**ముందడుగు తెలంగాణ:**

మంత్రి కొండా సురేఖ మరోసారి బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. గజ్వేల్ పర్యటన సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. సోషల్ మీడియాను అడ్డం పెట్టుకొని తమపై పిచ్చి రాతలు రాయిస్తున్నారని మండిపడ్డారు. "తొమ్మిది హామీలు అమలు చేస్తే పదో హామీ ఎందుకు ఇవ్వలేదని కేటీఆర్ ప్రశ్నిస్తున్నారు. పదవీ కాంక్షతో కేసీఆర్‌ని కేటీఆరే ఏదో చేశారన్న ప్రచారం జరుగుతోంది. కేటీఆర్ సీఎం అనుకుని పిచ్చి నిర్ణయాలు తీసుకున్నారు.



బిఆర్ఎస్ ఓడిపోవడానికి ప్రధాన కారణం ఆయనే. బడ్జెట్ రోజు అసెంబ్లీకి వచ్చిన కేసీఆర్ మళ్లీ కనిపించలేదు. ఫామ్‌హౌస్‌లో ఏం చేస్తున్నారో తెలియదు. గజ్వేల్‌లో కేసీఆర్ కనిపించడంలేదని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తాం. పార్లమెంట్ ఎన్నికల్లో సిద్దిపేట, గజ్వేల్ నియోజకవర్గాల్లో భాజపా, భారాస మధ్య చీకటి ఒప్పందం జరిగింది. కవిత బెయిల్ కోసం ప్రధానితో మాట్లాడి ఒప్పందం చేసుకుని.. భారాస నుంచి భాజపాకు క్రాస్ ఓటింగ్ జరిగింది" అని కొండా సురేఖ ఆరోపించారు.

# ఇక వాట్సాప్‌లో శ్రీవారి టికెట్లు

## టీటీడీకి ఏపీ ప్రభుత్వం సూచన

సామాన్యులు సులభంగా తిరుమల శ్రీవారిని దర్శించుకునేలా ముందస్తు బుకింగ్ విధానాన్ని తీసుకురావాలని ఏపీ ప్రభుత్వం యోచిస్తున్నది. టీటీడీలో వాట్సాప్ ద్వారా ద ర్శనం బుకింగ్ సేవలను ప్రారంభించి, తర్వా త అన్ని ఆలయాల్లోనూ ఈ విధానాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు ఆలోచిస్తున్నది. శ్రీవారి దర్శనం కోసం సిఫార్సు లేఖల ఒత్తిడి ఎక్కువగా ఉండటంతో ఈ నిర్ణయం తీసుకోనున్నట్టు తెలిసింది.



ముందడుగు
శుక్రవారం, 04-10-2024, హైదరాబాద్

# ఐదేళ్లలో నాలుగు పార్టీలు మారాడు

## రాహుల్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన అశోక్ తన్వర్



**ముందడుగు హరియాణా:**

హరియాణాలో బిజెపి పార్టీ సీనియర్ నేత, మాజీ ఎంపీ అశోక్ తన్వర్ కాంగ్రెస్ గూటికి చేరారు. మహేంద్రగఢ్ జిల్లాలో నిర్వహించిన ఎన్నికల ప్రచార ర్యాలీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సమక్షంలో ఆయన 'హస్తం' పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. రాహుల్ తన ప్రసంగాన్ని ముగించిన అనంతరం వేదికపై నుంచి అశోక్ తన్వర్ తమ పార్టీలో చేరుతున్న విషయాన్ని ప్రకటించారు. ఈ ఏడాది బిజెపిలో చేరిన తన్వర్.. తిరిగి సొంత గూటికి చేరుతున్నారని పేర్కొన్నారు. 201419 మధ్యకాలంలో హరియాణా కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్న తన్వర్.. 2019 నుంచి ఇప్పటివరకు నాలుగు పార్టీలు మారడం గమనార్హం. గతంలో అశోక్ తన్వర్ గాంధీ కుటుంబానికి సన్నిహితంగా ఉండేవారు. కానీ, 2019లో భూపీందర్ సింగ్ హుడాతో తలెత్తిన విభేదాల నేపథ్యంలో హస్తం పార్టీకి గుడ్‌బై చెప్పారు. ఆ తర్వాత తృణమూల్ కాంగ్రెస్, ఆప్ పార్టీల్లోనూ కొంత కాలం పాటు పనిచేశారు. ఈ ఏడాది ఆరంభంలో భాజపాలో చేరిన తన్వర్.. తాజాగా అసెంబ్లీ ఎన్నికల వేళ తిరిగి సొంతగూటికి చేరారు. దశాబ్ద కాలం తర్వాత భాజపా నుంచి అధికారాన్ని చేజిక్కించుకోవాలని తపిస్తున్న కాంగ్రెస్‌కు తన్వర్ రాక మరింత బలాన్ని చేకూర్చే అవకాశం ఉంది. మరోవైపు, అక్టోబర్ 5న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో ప్రచారానికి ఈరోజు సాయంత్రం 6గంటలతో తెరపడనుంది.

# ఆర్జీ కర్ ఆసుపత్రిలో అత్యాచార బాధితురాలి విగ్రహం

## క్రై ఆఫ్ ది హవర్ పేరుతో ఏర్పాటు

**ముందడుగు పశ్చిమ బెంగాల్:**

పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో అత్యాచారానికి గురైన బాధిత ట్రైనీ డాక్టర్ విగ్రహాన్ని అక్కడ ఆవిష్కరించారు. 'క్రై ఆఫ్ ది హవర్' పేరుతో దీనిని ఏర్పాటు చేశారు. దీంతో ఈ అంశంపై మరో వివాదం చెలరేగింది. కళాకారుడు అసిత్ సైన్ 'క్రై ఆఫ్ ది హవర్' పేరుతో ఒక విగ్రహాన్ని రూపొందించారు. ఒక మహిళ ఏడుస్తున్నట్లుగా ఉన్న ఈ విగ్రహం జీవితంలోని చివరి నిమిషాల్లో బాధితురాలు పడిన వేదన, భయానక స్థితిని ప్రతిబింబిస్తున్నదని పేర్కొన్నారు. ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ కార్యాలయం ఉన్న భవనం సమీపంలో ఈ విగ్రహాన్ని ఆవిష్కరించారు.





అత్యాచార బాధితురాలి విగ్రహం ఏర్పాటుపై సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తాయి. బాధితురాలిని అగౌరవ పరిచేలా, చాలా అసహ్యకరంగా ఈ విగ్రహం ఉందని కొందరు విమర్శించారు. అత్యాచార బాధితురాలి విగ్రహాన్ని దేశంలో ఎక్కడైనా, ఎప్పుడైనా ఏర్పాటు చేశారా? అని ఒకరు ప్రశ్నించారు. తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) నేత కునాల్ ఘోష్ కూడా ఈ విగ్రహంపై స్పందించారు. బాధితురాలి పేరు, గుర్తింపును వెల్లడించ కూడదన్న సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు ఇది విరుద్ధమని అన్నారు. 'బాధ్యతాయుతులైన వారెవరూ అలా చేయరు. కళ పేరుతో కూడా చేయలేరు. నిరసనలు, న్యాయం కోసం డిమాండ్లు ఉన్నాయి. కానీ బాధతో కూడిన అమ్మాయి ముఖంతో విగ్రహం సరైనది కాదు. బాధితురాలి ఫొటోలు లేదా విగ్రహాలు వినియోగించకూడదని మార్గదర్శకాలు ఉన్నాయి' అని ట్వీట్ చేశారు.

# గిఫ్ట్‌లు స్వీకరించినందుకు 12 నెలల జైలు

## సింగపూర్ మాజీ మంత్రికి శిక్ష విధించిన కోర్టు

**ముందడుగు జాతీయం:**



సింగపూర్‌లో ఒక సీనియర్ మాజీ క్యాబినెట్ మంత్రి సుబ్రమణియం ఈశ్వరన్‌కు ఓ కేసులో 12 నెలల జైలుశిక్ష పడింది. ప్రభుత్వంలో ఉన్న సమయంలో గిఫ్ట్‌లు స్వీకరించినట్లు 62 ఏళ్ల ఈశ్వరన్ కోర్టులో అంగీకరించారు. సుమారు 4 లక్షల డాలర్ల విలువైన బహుమతుల్ని తీసుకున్నట్లు తెలుస్తోంది. ఫార్ములా వన్ గ్రాండ్ ప్రి, బ్రాంప్టన్ టీలైన్ బైస్కిల్, మద్యం, ప్రైవేటు విమానంలో ప్రయాణం లాంటి గిఫ్ట్స్‌ను స్వీకరించినట్లు నిర్ధారించారు. సింగపూర్ హైకోర్టులో జస్టిస్ విన్సెంట్ హూంగ్ ఈ కేసులో తీర్పునిచ్చారు. రవాణాశాఖ మాజీ మంత్రిగా చేసిన సుబ్రమణియం.. అధికారాన్ని దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అక్టోబర్ 7వ తేదీన మంత్రి ఈశ్వరన్ జైలులో లొంగిపోనున్నారు. గత 50 ఏళ్లలో జైలుశిక్ష పడిన రాజకీయవేత్తగా మంత్రి ఈశ్వరన్ నిలిచారు.

# నకిలీ ఎస్‌బీఐ బ్యాంకు బ్రాంచ్‌ను తెరిచారు

## గ్రామస్తుల నుంచి ఖాతాలు తెరిచి మోసం చేశారు

### ఛత్తీస్‌గఢ్‌లోని శక్తి జిల్లాలో సంఘటన

**ముందడుగు ఛత్తీస్‌గఢ్:**

కొందరు వ్యక్తులు డబ్బులు వసూలు చేసేందుకు ఏకంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పేరుతో నకిలీ బ్రాంచ్‌ను తెరిచారు. ఆ బ్రాంచ్‌లో బ్యాంకు కార్యకలాపాలు కూడా ప్రారంభించారు. గ్రామస్తుల నుంచి డబ్బులు జమ చేసుకున్నారు. సమీపంలోని ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్‌కు సమాచారం అందడంతో ఈ మోసం బయటపడింది. ఛత్తీస్‌గఢ్‌లోని శక్తి జిల్లాలో ఈ సంఘటన జరిగింది. కొందరు వ్యక్తులు భారీ బ్యాంకింగ్ మోసాన్ని పక్కాగా ప్లాన్ చేసి అమలు చేశారు. మారుమూల ప్రాంతమైన ఛపోరా గ్రామంలో ఏకంగా ఎస్‌బీఐ పేరుతో నకిలీ బ్రాంచ్‌ను తెరిచారు. కాంప్లెక్స్‌లోని షాపును అద్దెకు తీసుకున్నారు. నిజమైన బ్యాంకుగా నమ్మించేందుకు ఫర్నీచర్‌తోపాటు క్యాష్ కౌంటర్ వంటివి ఏర్పాటు చేశారు.




ఈ బ్రాంచ్ పట్ల ఆయన అనుమానం వ్యక్తం చేశారు. దీంతో సెప్టెంబర్ 27న ఎస్‌బీఐ అధికారులు, పోలీసులు కలిసి అక్కడకు వెళ్లారు. అచ్చం ఎస్‌బీఐ బ్రాంచ్ మాదిరిగా కనిపించడంతోపాటు బ్యాంకింగ్ సేవలు నిర్వహిస్తున్న నకిలీ బ్రాంచ్‌ను చూసి వారు కంగుతిన్నారు. ఈ మోసంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గ్రామస్తులు డబ్బులు పోగొట్టుకోగా, నిజంగా బ్యాంకు ఉద్యోగమని నమ్మి నియామక పత్రాలు పొందిన వారు కూడా చిక్కుల్లో పడ్డారు.

ముందడుగు
శుక్రవారం, 04-10-2024, హైదరాబాద్

## రైతు బిడ్డలను అమ్మాయిలు నచ్చడం లేదు

### మహారాష్ట్ర ఎమ్మెల్యే వివాదాస్పద వ్యాఖ్యలు



**ముందడుగు మహారాష్ట్ర:**

వ్యవసాయం చేసే యువకులను పెళ్లి చేసుకోవడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. అందమైన అమ్మాయిలు మాత్రం వ్యవసాయం చేసే యువకులు అంటేనే పెళ్లికి నిరాకరిస్తున్నారని మహారాష్ట్ర ఎమ్మెల్యే దేవేంద్ర భూయర్ చేసిన వ్యాఖ్యలు వివాదం రేపాయి. మహారాష్ట్రలోని అమరావతి జిల్లా, వరుద్ తహశీల్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఓ అమ్మాయి అందంగా ఉంటే, ఆమె పెండ్లి చేసుకోవడానికి నీలాంటి, నాలాంటివాళ్లని ఇష్టపడటం లేదు. ఆమె ఉద్యోగస్థుడినే ఎంచుకుంటున్నది.

నంబర్ 2లో, ఓ మోస్తరు అందంగా ఉండే అమ్మాయిలు కిరాణా దుకాణం, పాన్ కొట్టు నడిపే యువకులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. అందంలో తక్కువ స్థాయిలో ఉన్న అమ్మాయిలు రైతుల కుమారులను చేసుకుంటున్నారు' అని అన్నారు. అలాంటివారికి అందగాళ్లు పుట్టడం లేదన్నారు. దేవేంద్ర భూయర్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. ఆయన మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్‌కు మద్దతిస్తున్నారు. దేవేంద్ర వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత యశోమతి ఠాకూర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఆమె శరీరంపై నిర్ణయం తీసుకునే హక్కు ఆమెకే

### అబార్షన్ హక్కులపై అధికారం రాష్ట్రాలకే

### అబార్షన్ హక్కును సమర్థించిన మెలానియా



**ముందడుగు జాతీయం:**

అగ్రరాజ్యం అమెరికాలో అధ్యక్ష ఎన్నికల వేడి కొనసాగుతోంది. ఈ ఎన్నికల ప్రచారంలో ప్రభావితం చేసే కీలకాంశాల్లో అబార్షన్ హక్కు ఒకటి. అధ్యక్ష అభ్యర్థులు కమలా హారిస్, డొనాల్డ్ ట్రంప్ మధ్య గత నెల జరిగిన డిబేట్‌లో గర్భవిచ్ఛిత్తి అంశంపై ఇరువురు వాడీవేడిగా వాదించారు. ఈ క్రమంలో ట్రంప్ సతీమణి మెలానియా నుంచి కీలక స్పందన వచ్చింది. అబార్షన్ హక్కులపై అధికారం రాష్ట్రాలకే ఉండాలని ట్రంప్ వాదిస్తుండగా.. మెలానియా మాత్రం అబార్షన్ హక్కును సమర్థించారు.

'మెలానియా' పేరుతో అక్టోబర్ 8న విడుదల కానున్న మెమోర్‌లో ఈ అంశం గురించి ఆమె తన అభిప్రాయాన్ని పొందుపరిచారని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. "ఆమె శరీరం గురించి నిర్ణయాలు తీసుకునే హక్కు ఆమెకుగాకుండా ఇంకెవరికో ఎందుకు ఉండాలి..? అవాంఛిత గర్భానికి సంబంధించి ఒక మహిళ తీసుకునే నిర్ణయాన్ని పరిమితం చేయడం.. ఆమె సొంత శరీరంపై నియంత్రణను నిరాకరించడం కిందికే వస్తుంది" అని ఆమె రాసుకొచ్చారు. నవంబర్ 5న ఎన్నికలు జరగనుండగా.. దానికి కొన్ని వారాల ముందు ఈ పుస్తకం విడుదల కానుంది. గత నెల జరిగిన డిబేట్‌లో కమల మాట్లాడుతూ.. "మహిళల అభివృద్ధి ట్రంప్‌నకు గిట్టదు. అబార్షన్లపై ఆయన నిషేధం విధించాలనుకుంటున్నారని వ్యాఖ్యానించారు. దీనికి ట్రంప్ ఘాటుగా బదులిచ్చారు. "ఆమె అబద్ధం చెబుతున్నారు. గర్భవిచ్ఛిత్తిపై నిషేధానికి నేను అనుకూలం కాదు. ఆ బిల్లుపై సంతకం చేయబోను" అని చెప్పారు.

## గొప్ప సమాజసేవకురాలిని కోల్పోయాం

### మా అక్క మరణం అత్యంత బాధాకరం ■ మాజీ సిబిఐ జెడీ లక్ష్మినారాయణ

**ముందడుగు హైదరాబాద్:**

అన్ని రంగాల్లో తన కంటూ ఒక ప్రత్యేకతను చాటుకొని, సమాజసేవయే పరమావధిగా భావించిన మా అక్క కనకదుర్గను కొల్పోవడం అత్యంత బాధాకరమైన విషయమని మాజీ సిబిఐ జెడీ లక్ష్మినారాయణ అన్నారు. గురువారం బేగంపేట కంట్రీక్లబ్‌లో డా. వి. కనకదుర్గ శ్రద్ధాంజలి నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజం ఒక గొప్ప వ్యక్తిని కోల్పోయింది. మా ఇంట్లో పెద్ద దిక్కుగా అన్ని పనులు దగ్గరుండి చూసుకునేది. గత పది సంవత్సరాలుగా స్వయం కృషితో కలిసి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించింది. చిన్న, పెద్దా అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరితో ఎంతో మర్యాదగా పలకరించే వారు. మంచి మనసు, మంచి ఆలోచన కలిగిన వ్యక్తి ఈ రోజు మన మధ్యలో లేకుండా పోవడం అందరిని కదిలించే అంశమని అన్నారు. మా అక్క కనకదుర్గ ఆశయ సాధన కోసం మనమంతా కలిసి, మెలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. భావితరాలకు కూడా సమాజానికి సేవ చేసే వ్యక్తులు చాలా అవసరమని అన్నారు.

మా బావ చాలా ఓపిక అని, ఆయనకు మా కోడలు ఐశ్వర్యకు ఆ భగవంతుడు ధైర్యాన్ని ఇవ్వాలని ఆయన కోరారు. కనకదుర్గ కూతురు ఐశ్వర్య అమ్మ గురించి మాట్లాడుతూ కన్నీటి పర్యంతమయ్యారు. మా అమ్మ గురించి చెప్పడానికి పదాలు లేవని, మా అమ్మ నిత్యం మాతోనే ఉంటుందన్నారు.



ముందడుగు
శుక్రవారం, 04-10-2024, హైదరాబాద్

# ముందడుగు సెల్ఫీ కాంటెస్ట్

## బతుకమ్మ చిత్రాలు...









ముందడుగు తెలంగాణ: ముందడుగు పౌండేషన్, సేవ్ ద గర్ల్ చైల్డ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నేను- నా బతుకమ్మతో సెల్ఫీ కాంటెస్ట్ కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన మహిళల బతుకమ్మ చిత్రాలు.. మీరు మీ బతుకమ్మతో సెల్ఫీ పంపాలనుకుంటే 9491114616 నంబర్ కు వాట్సప్ చేయగలరు. మీ ఫోటోను ముందడుగు పేపర్లో ప్రచరించడంతో పాటు ఎంపికైనా మొదటి ఐదుగురు విజేతలకు ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్, చంచల్ గూడ జైలు సూపరిండెంటెంట్ శివకుమార్ చే బహుమతులు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు.







